# ఆడవాళ్ళు తప్పుచేస్తే ఊరుకుంటారా!

■ **మంజుశ్రీ**

"ఎవరు?"
"మగవాళ్ళు!"
"ఎందుకు?
"ఎందుకో"
"ఏం చేస్తారు?"
"సాధిస్తారు. ఉరేసుకోవచ్చు. ఊరొదిలిపోవచ్చు. నిన్ను వదిలేశాననవచ్చు."

* * *

"ఈ ప్రశ్నలో రెండు ప్రశ్నార్థకాలూ, రెండు సందేహార్థకాలూ ఉన్నాయి. అవి ఏమంటే, 'ఆడవాళ్ళు ఊరుకుంటారా అని' కాక, ఆడవాళ్ళు తప్పు చేస్తే మగవాళ్ళు ఊరుకుంటారా అని. పాపం! నూటికి తొంభై తొమ్మిది మంది ఊరుకుంటారు. పదికి తొమ్మిది మంది తప్పు చెయ్యరు."

"ఇంత ధీమాగా నువ్వెట్లా చెపుతున్నావు గోవర్ధన్" అని అడిగాడు రంగరాజు.

"రంగా నీకు గుర్తుందా. ఒక పౌర్ణమినాడు బాగా పొద్దుపోయిన తరువాత విశాఖపట్నం బీచ్ ఒడ్డున మనిద్దరం ఒకరికొకరం హెచ్చరించుకున్నాం. మాట ఇచ్చుకున్నాం. ఆ మాట మాటేమిటి" అన్నాడు ఐస్‌క్రీమ్ తింటూ గోవర్ధన్. భోజనాలైపోయాయి. పిండారబోసినట్లు వెన్నెలగాస్తున్నాడు చంద్రుడు.

"మల్లెపూలు అన్నీ కోసేశాం కదా! ఇంకా ఎక్కడి నుంచి ఈ వాసన" అని అడిగింది సావిత్రి.

"నూతి చప్టా పక్కన నైట్ క్వీన్ వాసన. అదీకాక మరీ మొగ్గలనుకొని మనం కొన్ని వదిలేసి ఉంటాం. అవి పూసి ఉంటాయి" అని చెప్పింది శారద.

"రోజూ ఇన్ని పూలు కోసి మాల కట్టాలంటే కష్టమే" అంది సావిత్రి.

"ఆ! రోజూ నేను కోస్తానా! పొద్దునా, సాయంకాలం పనిపిల్ల పట్టుకెళుతుంది. అదే నాకు కోసి ఇస్తుంది" అని చెప్పింది శారద.

"మీకు మేడ మీద పడక. సాధారణంగా ఆ గది ఎప్పుడూ వాడం. ఎప్పుడో మా అమ్మా నాన్నా వస్తే మేము పైకి వెళ్తాం. వాళ్ళు మెట్లెక్కలేరు కదా అందుకని."

"మీ అమ్మా నాన్నా వస్తుంటారా" అని అడిగాడు గోవర్ధన్.

"ఆ! వచ్చి నెలో, రెణ్ణెల్లో ఉండి వెళతారు ప్రతి సంవత్సరం. ఇప్పుడిక్కడికి నేను వచ్చి ఎనిమిదేళ్ళు కావస్తోంది. ఆ! సరే గోవర్ధన్. ఇందాక నీవా సంగతి గుర్తు చేశావు. నీవు రెడీ అయితే నేను రెడీ."

"అయితే, టెర్రస్ మీదికి వెళ్ళి కూచుందాం" అన్నాడు గోవర్ధన్.

"సముద్రపు ఒడ్డు కదా! పది కాగానే చల్లగాలి వస్తుంది. నీకు నిద్ర రాకపోతే పైనే బెడ్ రూమ్ పక్కన వరండాలో కూచుందాం. దూరంగా సముద్రం హోరు కూడా వినపడుతుంటుంది. మనం ఏ రహస్యాలు చెప్పుకున్నా ఎవరికీ వినపడదు. మరి మిసెస్ గోవర్ధన్ నిద్రపోతారో ఏమో!"

"ఆమె నిద్రపోవడానికీ, మన రహస్యానికీ మధ్య షరతేమిటోయ్! నిద్ర వస్తే పోతుంది. అయినా, ఇంత తొందరలో వాళ్ళు తెములుతారనుకోను. వాళ్ళకు కూడా క్లాస్‌మేట్స్ రహస్యాలుంటాయి కదా! ఇక అత్తగార్లూ, ఆడబడుచులూ, పట్టుచీరెలు, బంగారాల ముచ్చట్లు వస్తే వాళ్ళకు అర్ధరాత్రి కూడా నిద్రరాదు. అవునంటారా సావిత్రిగారూ" అని గోవర్ధన్ వెటకారం చేశాడు.

శారద ఫక్కున నవ్వింది.

"అస్తమానం ఆఫీసర్లూ, షేర్లూ, అమెరికాలూ, ఆబలూ మీకు మాత్రం అవే కబుర్లు కదా" అని సావిత్రి వేళాకోళం చేసింది.

"మీరు ఎంత సేపు మాట్లాడుకుంటారో మాట్లాడుకోండి. నీవు పైకి రావడం, రంగ కిందికి రావడం ఏకకాలంలో జరుగుతాయి" అని సావిత్రికి సైగ చేసి చెప్పాడు గోవర్ధన్.

మిత్రులిద్దరూ మేడ పైకి వెళ్ళారు. దూరంగా ఇసుకలో వెన్నెల మెరుస్తున్నది. చిన్న కాలనీ అది. రెండు వందల ఇళ్ళుండవచ్చు. దూరంగా అంతరిక్ష పరిశోధన కేంద్రం. చంద్రుడి మీద వలసలేర్పరుచుకొంటారట దేశదేశాల వాళ్ళు. మళ్ళీ అక్కడ వాణిజ్యం, పేటెంట్లు, ఆయుధీకరణ, నిరాయుధీకరణ బెదరింపులూ ఉండవా?

పదేళ్ళ కిందట విశాఖపట్నంలో గోవర్ధన్, రంగరాజు క్లాస్‌మేట్స్. అర్ణవ శాస్త్రం (ఓసియనోగ్రఫీ) చదివేవాడు రంగరాజు. అణు భౌతిక విజ్ఞానం చదివేవాడు గోవర్ధన్. భీమవరం దగ్గర పక్కపక్క ఊళ్ళు వాళ్ళవి. చిన్న క్లాసులు వీరవాసరంలోనే చదివారు. అప్పటినుంచి స్నేహం.

విశాఖపట్నంలో బీచ్‌లో ఒక పున్నమిరాత్రి వాళ్ళిద్దరూ చేసుకున్న ఒప్పందం ఏమంటే, మళ్ళీ వాళ్ళు మొదటిసారి కలుసుకున్నప్పుడు జీవితంలో తారసపడిన అత్యంత గొప్పమైన సంఘటన ఒకరికొకరు చెప్పుకోవాలని. అది ఇతరులకెవరికీ, ఆఖరికి భార్యకు కూడా చెప్పడానికి సంకోచపడేదీ, మొహమాట పడేదీ, కొంపలంటుకొనేదీ అయినా సరే. ఓ.కే అంటే ఓ.కే అనుకున్నారేమో!

అది ఇప్పుడు ఒకరు గుర్తు చేస్తే ఒకరికి గుర్తు వచ్చింది. వేసవికాలం. మధ్యాహ్నమంతా బాగా ఉక్కపోసింది. కూలర్ పెట్టుకుని బాగా నిద్రపోయాడు గోవర్ధన్. "సాధారణంగా ఆరింటికి కానీ ఇంటికి రాను. ఇవాళ ముందే వస్తాను" అని వర్క్ ప్లేస్‌కు వెళ్ళిపోయాడు రంగరాజు. సావిత్రిని తీసుకుని శారద తెలిసిన వాళ్ళింటికి వెళ్ళివస్తామని భోజనాలు కాగానే ఇద్దరూ కలిసి వెళ్ళారు. సాయంకాలం అయిదవుతుండగా వాళ్ళు వచ్చారు.

గోవర్ధన్‌కి నిద్ర రావడం లేదు. అందుకే ఆ విషయం గుర్తు చేశాడు. అవాళ కూడా ఇవాళ లాంటి పున్నమిరాత్రేనేమో? ఐస్‌క్రీమ్ తింటుండగా గుర్తు వచ్చింది ఆ విషయం. అవాళ బహుశా అది వేసవి రాత్రి. అవాళా ఐస్‌క్రీమ్ తింటూనే వాళ్ళు ఈ విషయం అనుకున్నారు. తరువాత పరీక్షలు. ఇంటర్వ్యూలు. ఉద్యోగాలు. భీమవరంలోనే జరిగింది కాబట్టి రంగరాజు పెళ్ళికి గోవర్ధన్ రాగలిగాడు కానీ బొంబాయిలో జరిగిన గోవర్ధన్ పెళ్ళికి రంగరాజు వెళ్ళలేకపోయాడు. తరువాతెప్పుడో రైలు ప్రయాణంలో విశాఖపట్నంలో తటస్థపడినప్పుడు శారద, సావిత్రిని చూసింది. కలుపుగోలుగా మాట్లాడింది. శ్రీహరికోట రమ్మనీ, రావాలనీ సావిత్రి దగ్గర ప్రామిస్ కూడా చేయించుకుంది.

* * *

"చెప్పు రంగా!"

"ఇంజనీరింగ్ కాగానే పి.హెచ్.డి చేయాలని నేను చాలా తాపత్రయపడ్డాను. బయటివాళ్ళు యూనివర్సిటీలలో ఎటువంటి కక్షలూ కల్మషాలూ ఉండవనుకుంటారు. అక్కడున్నన్ని ఈర్ష్యాద్వేషాలు, భ్రష్ట రాజకీయాలు, కులరోగాలూ ఎక్కడా ఉండవు. నరసాపురం దగ్గర కొత్తగా ఆఫ్‌షోర్ డ్రిల్లింగ్ జరుగుతోంది. పెద్ద ప్రాజెక్టు. అక్కడ నాకు జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. రెండు మూడేళ్ళు పని చేసి తరువాత ఏం జరుగుతుందో చూదాం అని వెళ్ళి చేరిపోయాను. బాగానే ఉండేది. చమురు కనపడితే బలే ఉత్సాహంగా ఉండేది. చిన్నతనం. యూనివర్సిటీ నుంచి అప్పుడే ఫ్రెష్‌గా వచ్చాం కదా! అందరూ బహు మెచ్చుకునేవారు. 16 గంటలు పని చేసినా ఏమీ అలసట అనిపించేది కాదు. మాధవాయపాలెం దగ్గర క్యాంపు.

నా సీనియర్ ఇంజనీర్ శ్రీనివాసరాఘవకు నేనంటే చాలా ఇష్టంగా ఉండేది. మూడు రోజులకోసారైనా నన్ను వాళ్ళింటికి తీసుకొని వెళ్ళేవారు. శని, ఆదివారాలు వాళ్ళింట్లోనే పనిచేసుకునేవాణ్ణి. అప్పటికింకా కంప్యూటర్లు రాలేదు. కాబట్టి చాలా పని ఉండేది. ఆయనకు పని తప్ప వేరే లోకం ఉండేది కాదు. తరచు పది రోజులు, పదిహేను రోజులు ఢిల్లీలో ఉండేవారు. ఇక్కడ ఉన్నప్పుడు కూడా పడవ మీదనే కాపరం. ఆయన అమెరికాలో ఆరేళ్ళుండి వచ్చారు. దేశం మీద ప్రేమ. కొత్తవి కనుక్కోవాలనీ, తాను పుట్టి పెరిగి బాగుపడిన తన మాతృదేశం బాగుపడితే తనకదే చాలుననుకునే తపన ఆయనకుండేది. స్వభావం చాలా మంచిది. ఎంతో మేధకుడు. క్లాస్ ఫోర్త్ వాళ్ళతో కూడా ఎంతో మర్యాదగా, నెమ్మదిగా మాట్లాడేవాడు.

నా దురదృష్టం. మొదట్లో అలా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు. రాఘవగారి భార్య సౌందర్య వల్లి. ఆవిడ నా పట్ల చాలా ఆకర్షణ చూపేది. చొరవగా ప్రవర్తించేది. నేనొక్కణ్ణే ఉన్నప్పుడు ఏవేవిటో కబుర్లు చెప్పేది. మొత్తానికావిడకేదో అసంతృప్తి. ఎవరి మీదనో అసహనం. చిన్నగా కూపీ లాగాను. వాళ్ళది నిడదవోలు. బ్రాహ్మలే. వైష్ణవులనుకుంటాను. తిరుపతిలో మ్యూజిక్‌లో ఎం.ఏ చేశానని చెపుతుండేది. ఇక్కడ తాను పాడితే, మొగుణ్ణి రాపాడితే తన పాట ఎవరు వింటారు? సముద్రం వినాల్సిందే. ఆయనకు సంగీతమన్నా, సాహిత్యమన్నా బొత్తిగా అభిరుచి లేదు. తనదొక భగ్న ప్రేమ కథ. అతడు మోసం చేశాడు. ఎందుకు చేశాడో తెలీదు. ఏం బావుకున్నాడో అంతకన్నా తెలీదు. తాను అతడే సర్వస్వం అనుకుంది. అంతవరకెందుకు? ఇప్పుడొచ్చి క్షమాపణ చెప్పినా తానతడి వెంట వెళ్ళిపోతుంది. ఆ రేవతి ఏం బావుంటుంది? చదువూ సంధ్యా కూడా లేవు. ఆవేశంగా పురుషాహంకారం, స్త్రీ దాస్యం అంటూ గొంతు చించుకొని ఉపన్యాసాలు దంచుతుంది. ఆవిడతో శ్రీధరబాబుగారికి దోస్తీ. 'అబ్బే అదేం లేదు. మన ప్రేమకు ఆటంకం లేదు. నేనూ, నీవూ అమెరికా వెళ్ళిపోవడమే ఖరారు' అని నా కొంగు పట్టుకొని తిరిగేవాడు. ఎంత చదువుకున్నా ఇంటి దగ్గర నాకు ఒత్తిడి ఎక్కువైంది. పెళ్ళికాక తప్పలేదు. పెళ్ళైంది కాబట్టి పిల్లలూ పుట్టారు – అని, తన జీవితం

భగ్నమైపోయిందనీ, 'నీతో వస్తాను. మనం నగదూ, నగలూ తీసుకొని వెళ్ళిపోదాం' - అన్నంత దాకా వచ్చింది. నేనావిడతో పాప సంబంధం ఏమీ పెట్టుకో లేదు. కానీ, ఆవిడ వీలయినంత రెచ్చగొడుతుంటే అవకుణ్ణి అయ్యేవాణ్ణి. నాకు తండ్రిగారినో, అన్న గారినో మోసపుచ్చుతున్నంత బాధ కలిగేది. ఆవిడ మీద ఆకర్షణ లేదని చెప్పలేను. ఆమె చాలా అందంగా ఉండేది. అదీకాక పరువమైన వయసు. శృంగారం పేరుతో స్వేచ్ఛగా మాట్లాడగలిగేది. రాఘవగారు నన్ను ఎంతో ప్రేమగా, అభిమానంగా, తనకన్నా సీనియర్ ఉద్యోగిగా గౌరవించేవారు. సలహాలడిగేవారు. మేము భోజనం చేస్తున్నంత సేపు, ఇంట్లో ఆఫీసు పని, ప్రాజెక్టు పని చేసుకుంటు న్నంత సేపు ఆమె అనుమానం లేకుండానే చనువుగా, మర్యాదగా ఉండేది. ఆయనకిటువంటి విషయాలు తట్టనేతట్టవనుకుంటాను. ఆయన మనసంతా ఎక్కడో ఉండేది. బహు నెమ్మదస్థుడాయన.

ఒక రోజున సౌందర్య వల్లి మృదువుగానే నన్ను నిర్బంధించింది. "మనం ఇలా ప్రవర్తిస్తే, రాఘవగారికి తెలిస్తే తప్పుకాదా! ఆయనెంత బాధపడుతారు. తలెత్తుకొని తిరగగలరా? ఈ ఉద్యోగం చేయగలరా" అని అడిగాను.

"గంగలో దిగనీ - ఇలా కోపంగా మాట్లాడు తున్నానని అపార్థం చేసుకోవద్దు. నేను వేశ్యనూ అనుకోవద్దు. ఆయన మీద నాకూ జాలీ, గౌరవమూ ఉన్నాయి. కానీ, నా జీవితం యాంత్రికంగా వ్యర్థమై పోవడం ఇష్టం లేదు. నాకు జీవితం పట్ల ఎంతో

> విశాఖపట్నంలో బీచ్‌లో ఒక పున్నమిరాత్రి వాళ్ళిద్దరూ చేసుకున్న ఒప్పందం ఏమంటే, మళ్ళీ వాళ్ళు మొదటిసారి కలుసుకున్నప్పుడు జీవితంలో తారసపడిన అత్యంత గోప్యమైన సంఘటన ఒకరికొకరు చెప్పుకోవాలి.

మమకారముంది. ఆశలున్నాయి" అని నిస్సంకోచంగా నా చేయి పట్టుకుందామె.

నేను చాలా చలించిపోయాను. ఆ రాత్రికామె సంకేతం కూడా ఏర్పరచింది. రాఘవగారు ఆ కిందటి రోజే ఢిల్లీ వెళ్ళారు. మళ్ళీ వారం రోజులదాకా రారు. నేను క్యాంపులో నా క్వార్టర్‌లో ఆ రోజంతా పిచ్చివాణ్ణయిపోయాను. ఏమీ తోచలేదు. ఇక లాభం లేదని ఆ సాయంకాలమే భీమవరం వెళ్ళిపోయాను. మరి వారం రోజులకు రాఘవగారు వచ్చింతర్వాత వెళ్ళాను. ఆమెను చూసినప్పుడు నాకు భయం, కచ్చ, కోపం కలిగాయి. ఆమె ఎంతో మామూలుగా,

చిత్రాలు: నర్సిం



చలాకీగా నవ్వుతూ నన్ను పలకరించింది.

నేనా ఉద్యోగం మానుకొని వచ్చేస్తుంటే రాఘవ గారు చాలా బాధపడ్డారు. నీకు ఈ ప్రాజెక్టులో చాలా మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంతగానో నచ్చజెప్పారు. "చూడు మన రంగరాజు నేను చెప్పుతుంటే వినడం లేదు. బంగారం లాంటి భవిష్యత్తు పాడు చేసుకుంటున్నాడు. నువ్వయినా చెప్పు" అని అమాయకంగా ఆమెకు సిఫార్సు చేశాడు ఒక రోజున రాత్రి పొద్దుపోయిన తర్వాత బలవంతాన భోజనానికి ఉంచేసినప్పుడు. ఆమె నావేపు నిరసనగానూ, ఆపేక్షగానూ చూసి, "ఇంకా పెళ్ళీ, సంసారమూ, పిల్లలూ జంజాటం కూడా లేదుకదా. నాకు తెలిసిన మావాళ్ళ పిల్ల ఉన్నది" అని నవ్వింది.

నేను మంచి నిర్ణయం తీసుకున్నాననుకుంటు న్నాను ఇవాల్టికీ. లేకపోతే నా జీవితం ఏమైపోయి ఉండేదో. మాటవరసకి ఆమెతో సంసారం పెట్టుకొని ఉండేవాడిననుకో. మా అమ్మా నాన్నా, చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ ఎంత బాధపడేవాళ్ళు. రాఘవగారెంత కుంగిపోయి ఉండేవారు. ఆమె పిల్లలను నేను పెంచగలిగి ఉండేవాణ్ణా? వాళ్ళు నాలుగేళ్ళూ, రెండేళ్ళ పిల్లలే కాబట్టి తల్లితోనే ఉంటారుకదా! వాళ్ళ భవిష్యత్తేమిటి?

తర్వాత అందరిలాగానే నేనూ అమ్మా నాన్నా చూసిన సంబంధమే చేసుకున్నాను. మా నాన్న ఎంత సంబరపడ్డారో, ఆయన స్నేహితుడితో వియ్యమందుతున్నానని. అఫ్‌కోర్స్, నేనూ చూశాను. ఇద్దరం ఏకాంతంగా రెండు గంటలు మాట్లాడుకున్నాం. ఒకరి అభిరుచులు, ఆశలు ఒకరికొకరం అడిగి తెలుసుకున్నాం. నీవు వచ్చావు కదా పెళ్ళికి. శారదతో నాకు హాయిగానే జీవితం ముడిపడింది. ఇంతకు ముందు రెండేళ్ళు నేను త్రివేండ్రంలో ఉన్నాను. అందువల్ల నా ఎనిమిదేళ్ళ పిల్లాడు మా అమ్మా నాన్నా దగ్గరే ఉండి చదువుకుంటున్నాడు. శారదకది కొంచెం కష్టమే ననుకో. కానీ, ప్రతి వేసవి శెలవులకు, క్రిస్మస్ శెలవులకూ అమ్మా నాన్నా వచ్చి నాతో ఉంటారు, మా అబ్బాయితోపాటుగా.

నేను శారదకు ఎప్పుడయినా ఈ విషయం చెప్పాలనుకుంటాను. కానీ సిగ్గూ, బిడియమూ. అలా చెప్పటం మంచిది కాదనిపించేదీ. ఏమంటావు నీవు?

*　　*　　*

ఎమ్.ఎస్‌సి అయిపోయింతర్వాత మరో నాలుగేళ్ళు నేను వాల్తేరులోనే ఉండిపోయాను కదా! వెంటనే రిసెర్చ్‌కి అవకాశం లేకపోయింది. అందుకని డిపార్ట్‌మెంటుని అంటిపెట్టుకుని ఉన్నాను నేను. అప్పట్లో జరిగిందా సంఘటన. ఇప్పుడు తలచుకున్నా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. చాలా వింత సంఘటన. అప్పట్లో విశాఖలో కొత్త రేడియో స్టేషన్ వచ్చిందేమో! అందులో మాకు దూరపు బంధువొకతను పనిచేస్తుండేవాడు. కుర్రాడే. నాకంటే అయిదారేళ్ళు పెద్ద. పెళ్ళయింది. అప్పటికే అతడికి ఒక అబ్బాయి. చిన్నవాడు. రెండేళ్ళో, మూడేళ్ళో ఉంటాయి. ఎప్పుడన్నా నన్నతడు భోజనానికి పిలిచేవాడు. నేనంటే చాలా ఇంట్రస్ట్ చూపేవాడు. ప్రతి వారం కలిసేవాడు. ఆటవిడుపైతే హాస్టలుకొచ్చేవాడు. అక్కడి నుంచి బీచ్‌కో, ఏదైనా బుక్‌షాప్‌కో లేదా సినిమాకో వెళ్ళేవాళ్ళం. ఒకసారి సింహాచలం కూడా వెళ్ళివచ్చిన గుర్తుంది. ఎప్పుడూ ఏవో రంగేళీ కబుర్లు చెప్పుతుండేవాడు. మాట్లాడితే ఏదో పచ్చి శృంగారం ఒలకబోసేవాడు. నేనేం చెయ్యగలను. అది అతడి స్వభావం. నాక్కూడా చెప్పొద్దూ సరదాగానే ఉండేది. వయసటువంటిది కదా. ఏవో బూతు కథలు చెప్పేవాడు. వర్ణనలు చేస్తుండేవాడు. అటువంటి వద్యాలు అతడికి చాలా వచ్చు. అన్నట్లు అతడొక పేద్ద కవిగారి కొడుకు. ఆ కవి గారికి

బాగానే పేరుండేది. బహుశా ఆ కవిగారి పేరుప్రతిష్ఠల బట్టే ఈ కవిగాడికా ఉద్యోగం వచ్చి ఉంటుంది. అతడి పేరు గురుమూర్తి. వాళ్ళ నాన్నగారు వాళ్ళ గురువుగారి పేరు తనకు పెట్టుకున్నాడుట. గురుమూర్తి భార్య నాకు వదిన వరస. ఆమెకు నా పట్ల ప్రత్యేక ఆదరం ఉండడానికి ఒక కారణం ఉంది. ఆవిడకొక చెల్లెలుంది. ఆమెకు నేను ఈడూ జోడూ అని ఆమె ముచ్చట. అయితే, ఆవిడ చెల్లెలకు అంత చదువు లేదు. అదీ విమలగారి బెంగ. అయితే. రెండు మూడుసార్లు వాళ్ళ చెల్లెల్ని నాకు చూపడానికి ఆమె ప్రయత్నం చెయ్యకపోలేదు. ఓసారి గురుమూర్తి నన్ను చాలా బలవంతపెట్టాడు, వాళ్ళత్తగారి ఊరు ఎలమంచిలి ప్రయాణం పెట్టి. అది ఎందుకో కలిసిరాలేదు.

'ఓసారి గురుమూర్తి ప్రతాపం నిజమా లేక వట్టి మాట తీటా' అని నాకు చాలా అనుమానం వేసింది. గురుమూర్తి నాతో మాత్రమే తన కేళీకలాపాలు ఏకరువు పెట్టి ఊరుకునేవాడు కాదు. నా స్నేహితులతోనూ అంత చనువుగా ఏమీ ఎబ్బెట్టు లేకుండా కోతలు కోసేవాడు. పేకాట వ్యసనం కూడా ఉండేది గురుమూర్తికి. అందువల్ల మా డిపార్ట్‌మెంట్‌లో ఒకరిద్దరు లెక్చరర్ల ప్రాపకం కూడా సంపాదించాడు. నా దగ్గరకు వస్తూనో, లేక వాళ్ళ దగ్గర నుంచి వస్తూనో తరచూ నాకు తారసిల్లేవాడు.

ఓ రోజున ఉండబట్టలేక నేను నూటిగా అడిగాను. నీ వీరోచిత శృంగారం వట్టి బడాయా - నిజమా అని! "పోనీ నాతో ఈ రాత్రి 9 గంటల నుంచి 12 గంటల దాకా ఉండు, నీకే తెలుస్తుంది. 9 గంటల దాకా నేను క్లబ్బులో ఉండాలి" అన్నాడు. "సరే అయితే నన్ను క్లబ్బు దగ్గరకు వచ్చి నీకు కబురు పెట్టమంటావా" అని అడిగాను. "కబురు పెట్టటం దేనికి లోపలకు రాలేవా? అదేం పోరాని చోటు కాదే!



పోరాని చోటుకైనా ధైర్యంగా, రంజుగా, కులాసాగా పోయిరావాలి. అదీ మగసిరి అంటే. 'మంచి దినము నేడు మహరాజుగ రమ్మనవే' అని జావళీ వినలేదా" అని ఒక వెకిలి నవ్వు విసిరాడు. 'మగువ తన కేళికా మందిరము వెడలెన్' అని కూనిరాగం తీశాడు. వీడిదంతా ఆ గిరీశం చెప్పినట్లు వట్టి రస్సా ఏమోనని నా అనుపు. నా గుణుపు.

"సరే, నేను 9 గంటలకు ఆ ఆఫీసర్ క్లబ్‌కు వస్తాను" అన్నాను.

"అంతకన్నానా. శుభస్య శీఘ్రం. ఇవాళ నీకు అరంగేట్రం ఏర్పాటు చేస్తాను. క్లాస్ వన్‌కే తీసుక వెళ్తాను" అన్నాడు గురుమూర్తి. నాకు ఒకటే గుబగుబ. వయసు అట్లాంటిది కదా! ఒకవేళ పొరపాటునో, గ్రహపాటునో ఎవరికైనా తెలిస్తే ఎంత నామర్దా! నా మొహం ఎక్కడ పెట్టుకుని తిరగగలను అని బెరుకు పుట్టింది. పిరికి అనిపించింది. మళ్ళీ గురుమూర్తివన్నీ కోతలని గట్టినమ్మకం కలిగింది.

బాగా గుర్తుపట్టటానికి వీలులేనంతగా, రోజూ చూసే వాళ్ళకైతే అసలు తెలీకుండా 'డ్రెస్' చేసుకున్నాను. చలికాలం ఇంకా ప్రారంభం కాకపోయినా మఫ్లర్ ఒకటి చుట్టుకున్నాను- కళ్ళు మాత్రమే చూడగలిగేలా! నానా తంటాలు పడి క్లబ్ దగ్గరకు చేరాను.

గురుమూర్తి చుట్ట కాలుస్తాడని నాకు తెలీదు. అతడి జట్టులో నానా కంగాళీ మనుషులున్నట్లున్నారు. "భేష్. సత్యహరిశ్చంద్రుడి తరువాత నువ్వే మాట నిలబెట్టుకునే మనుషులలో జమ అనుకో. 'ఇప్పట్టును చూసి కాని ఇప్పట్టున లేవలేను మరి ఇంచుక నిల్వుము ఇప్డె వచ్చెదన్' అని పద్యమో పాడో అంటూ దాంతో పెద్దగా నవ్వాడు. అతడి మిత్రులు వీడు వదిలితే చాలురా బాబూ అనే మూడ్‌లో ఉన్నట్టుంది వెంటనే ముక్కలు కలిపేశారు.

నాకు ఒకటే వణుకు పుట్టుకుంది. రేపెప్పుడైనా వీళ్ళింటికి వెళితే విమలగారి ముఖం ఎలా చూడాలి? ఆమె ఇచ్చే కాఫీనో, మంచినీళ్ళో ఎలా తీసుకోవాలి అని. నిజంగానే తెగించాడు గురుమూర్తి. అప్పటికింకా విశాఖలో ఆటోలు ఎక్కువగా తిరగడం లేదు. క్లబ్ కాబట్టి ఒకటి ఎలానో

"తప్పనండీ ఆడవాళ్ళు తప్పు చేస్తే ఊరుకుంటారా?" "ఎవరు?" "మగవాళ్ళు" గోవర్ధన్ ఉలికిపడ్డాడు. అవాళ రాత్రి ఆమె తన కథ చెబుతుండే విన్నదా! ప్రశాంతంగా ప్రక్కన పడుకున్నంతో నిద్రపోతున్న ఆమెనెవ్వరు కదిలించటానికి కడుపు పడలేదు.

దొరికించుకున్నాడు గురుమూర్తి. ఆ ఆటో అతను గురుమూర్తిని గుర్తు పట్టాడు. నాకు ముచ్చెమటలు పోస్తున్నాయి. ఈ వెలది వెన్నెలలో ఆ మఫ్లరేమిటోయ్ గోవర్ధనా! నీకు మీ వాళ్ళు తప్పు పేరు పెట్టారు." 'ఇంటికా' అన్నాను నేను. ఇప్పుడింటికెందుకు. మరునింటికి అని నవ్వుతున్నాడు గురుమూర్తి. అన్నంత పని చేశాడు.

తీరా అక్కడకు వెళ్ళిన తరువాత 'నేను లోపలకు రాను. ఆటోలోనే కూర్చుని ఉంటాను' అన్నాను నేను. బోల్డు ఆశ్చర్యపడిపోయాడు గురుమూర్తి. 'సరే ఒకందుకు అదీ మంచిదేలే. నీకు స్వాగతం చెప్పిస్తాను. ఓ అరగంటలో నేను వచ్చేస్తాను. కూచుని ఉండు' అని లోపలికి వెళ్ళిపోయాడు. అరగంటే అయిందో పావుగంటే అయిందో నాకు తెలీదు. నాకు ఆటోలో చచ్చే చావుగా ఉంది.

గురుమూర్తి కాసేపటికి బయటకు వచ్చాడు. అతడితో నరసురాలిని కూడా తెచ్చాడు.

"వెళ్ళవయ్యా. నీది లక్కీ చాన్స్. ఇవాళే వచ్చారుట నెల్లూరి నుంచి ఈ సరుకు."

నేను మొహం ఎత్తుకోలేకపోయాను. ఆ వచ్చిన నరసురాలు చెయిపట్టుకొని బలవంతాన లాక్కుని పోయేటట్లున్నది. భయమో, భీతో, నా అదృష్టమో, "పోదాం పదవయ్యా గురుమూర్తీ" అన్నాను వణుకుతూ. పకపక నవ్వాడు గురుమూర్తి.

సరే పా. ఇంతకూ నీకా అదృష్టం లేదు. వార వనితా జనితా... అనేదో పద్యముంది చూడు. అది నీ మొహాన లేదు." బతుకు జీవుడా అని అక్కడ నుంచి పారిపోయివస్తుంటే, 'మగతలో ఉన్నాడా - మగతనం లేదా' అని నా గొంతు పిసికినట్లు కిసుక్కున నవ్వింది పిల్ల. పిల్ల అనే చెప్పాడు గురుమూర్తి ఆటోలో.

రంగా! నేను ఆ రోజు అట్లా బతికి బయట పడడం షేర్‌లక్ అనుకో. నీతి, అవినీతి, పాపం, పుణ్యం అవన్నీ అలా ఉంచు. నేను ఆ కొంపలోకి పోయి ఉన్నట్లయితే సావిత్రికి ఎంతో ద్రోహం జరిగిపోయి ఉండేది కదా! పాపం ఆవిడకంత ద్రోహం ఎందుకు జరగాలి? తానెలా ఉండాలి అని నేనాశిస్తానో నేనలానే ఆమెకు దక్కాలని ఆమె అనుకోవడంలో అత్యాశ కాని, దురాశ కాని, అనుకోకూడనిది కాని ఏమున్నాయి? మొదటి రోజున సావిత్రిని దగ్గరకు తీసుకుంటున్నప్పుడు నాకు చాలా భయం పుట్టింది. ఆమె చూడకుండా కన్నీళ్ళు తుడుచుకోవటానికి తంటాలు పడాల్సివచ్చింది. ఏదో పొలమారినట్లు, దగ్గొచ్చినట్లూ నటించాను."

* * *

"ఏమండీ ఇంకా నిద్రపోతున్నారు! లేవండి లేవండి. మా బాబు కదూ. మా కన్న కదూ" అని పక్క అంచు మీద కూచుని తట్టి లేపుతున్నది సావిత్రి. అటు నుంచి ఇటు తిరిగి మత్తుగా సావిత్రి వేపు చూశాడు. అమాంతం ఆమె నడుం చుట్టూ

చెయ్యి బిగించాడు గోవర్ధన్.

"ఛీ. నాన్సెన్స్. లేవండి. లేవండి. త్వరగా. అప్పుడే నా స్నానం కూడా అయిపోయింది. ఇవాళ రాజుగారు మనకు బోటు షైరు ఏర్పాటు చేశారు. వెళ్ళి అలా సముద్రంలోపడి పోదాం. మా బాబు కదూ. చప్పున తెమలాలి."

సావిత్రి వేపు పూర్తిగా కళ్ళు విప్పార్చి చూశాడు గోవర్ధన్. ధగధగ మెరిసిపోతున్నది. మల్లెపూలు బాగా విచ్చుకొని తడిసి మాదకత కలిగిస్తున్నాయి. సావిత్రికి తెలుసు.

సాయంకాలం మల్లెపూల కన్నా తెల్లవారుజామున మల్లెలు తికమక పెట్టేస్తాయి అని గోవర్ధన్ సిద్ధాంతం. మొదటిసారి గృహప్రవేశం అప్పుడు తాను తన భుజానికి చేరవడి నిద్రపోతుంటే ఆ తెల్లవారుజాము మల్లెపూల వాసన తానింకా మరచిపోలేను అని బులిపిస్తుంటాడు.

తానేదో ఆమె బిడ్డడైనట్లూ. తీసుకెళ్ళి నీళ్ళు పోయాల్సి (లాలి) ఉన్నట్లూ గారాబం చేస్తోంది సావిత్రి. పట్టు చీరలో దేవతలాగుంది. మల్లెపూలు చెదరటం ఆమెకిష్టం లేదు.

బద్ధకిస్తూ, ఆవలిస్తూ లేచాడు గోవర్ధన్. మురిపెంగా వెనకాలే వెళ్ళింది సావిత్రి.

"స్నేహితులు కలిస్తే తెల్లవార్లూ కబుర్లేనా! ఈయన మీకు రాత్రి చెప్పలేదా! పొద్దున 8 గంటలకు మనం బోటు షికారు వెళుతున్నామని. మీ బ్రేక్ ఫాస్ట్ రెడీగా ఉంది. మేమిద్దరం ఎప్పుడో తెమిలాం. మీదే ఆలస్యం" అంది శారద చనువుగా.

"నాకేం తెలుసు. రంగ నాకు ఆ సంగతి చెప్పలేదు" అని సంజాయిషీ ఇచ్చుకున్నాడు గోవర్ధన్.

* * *

నెల్లూరు స్టేషన్‌లో తెల్లవారుజామున 4.30 గంటలకు ట్రెయిన్. శారదా, రంగరాజూ వాళ్ళని రైలెక్కించి సెండాఫ్ ఇవ్వటానికి వచ్చారు. రైలు కదులుతుండగా చేతులూపుతూ తెలుపూ, నలుపూ కాని ఆకాశం కింద లైట్ల వెల్తురులో నిశ్శబ్దంగా వెనక వెనక నుంచి కనపడకుండా వెనకబడిపోయారు రంగరాజూ, శారదా.

ఫస్ట్ క్లాస్ కుపేలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. నెల్లూరులో వాళ్ళు దిగిపోయారేమో! ఎవరూ లేరు. సర్దుకుని ఎదురెదురు సీట్ల మీద కూచున్నారు సావిత్రీ, గోవర్ధన్. కుపే అంతా విచ్చిన మల్లెపూల వాసన గుబాళిస్తున్నది.

గోవర్ధన్ సీటు మీద పడుకోబోతుండగా గోముగా అతణ్ణి పడుకోనివ్వకుండా పక్కనే కూచుంది సావిత్రి. తన భుజం మీద చెంప ఆన్చి ఏదో అడగాలని తమకిస్తున్నట్లు అతడికనిపిస్తున్నది.

"మొన్న రాత్రి అంతా మా కబుర్లయితే, నిన్న రాత్రి అంతా మీ కబుర్లే సరిపోయె కదా! రాత్రి ఏ 12, ఒంటి గంటో అయి ఉంటుంది, నీవు మేడమీదికి వచ్చేసరికి" అని లాలనగానే అడిగాడు గోవర్ధన్. ఆహ్లాదకరమైన ఉదయ కాంతి సగం తెరిచి ఉంచిన గాజు కిటికీ తలుపుల్లోంచి కనపడుతోంది.

"అవునండీ, ఆడవాళ్ళు తప్పు చేస్తే ఊరుకుంటారా?"

"ఎవరు?"


"మగవాళ్ళు"

గోవర్ధన్ ఉలికిపడ్డాడు. అవాళ రాత్రి ఆమె తన కథ పొంచుండి విన్నదా!

ఆమె ఎప్పుడు పైకి వచ్చిందో తనకు తెలీదు. తాను గదిలోకి వెళ్ళేసరికి వేకువ 3 గంటలు కావస్తోంది. ప్రశాంతంగా ప్రపుల్ల దరహాసంతో నిద్రపోతున్న ఆమెనప్పుడు కదిలించటానికతడిష్ట పడలేదు. అలసటతో మేను వాల్చాడు. ముందు సగం కథ ఆమె విన్నట్లు లేదు. తమితో ఆమె పెదవులు తన వైపు తిప్పుకొని, "పడుకో కాసేపు. మద్రాసులో మన బ్రేక్‌ఫాస్ట్" అని కుషన్ సీటుపై జారబడ్డాడు. ■

# సామాజిక సంక్షేమమే గీటురాయి

## సాహితీమూర్తుల సేవలపై సదసద్వివేక విమర్శ, సమీక్ష



**విమర్శ ప్రస్థానం (వ్యాస సంపుటి)**
ద్వా.నా. శాస్త్రి
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ వారి అన్ని బ్రాంచీలు.
పేజీలు: 189.
వెల: రూ. 60/-

■ **మల్లంపల్లి ధూర్జటి**

తెలుగు సాహిత్యాన్ని అనునిత్యం అధ్యయనం చేస్తూ, అందులో వస్తున్న కొత్త ప్రక్రియలు, ధోరణులను పరిశీలిస్తూ, వాటిలోని గుణ దోషాలను పాఠకులకు అందిస్తున్న కొద్ది మంది విమర్శకులలో ద్వా.నా. శాస్త్రి ఒకరు. ఆయన రాసిన 30 సాహిత్య వ్యాసాల సంకలనమే ఈ పుస్తకం. ఇవన్నీ సాహిత్య వ్యాసాలే అయినప్పటికీ వీటిని స్థూలంగా మూడు రకాలుగా విభజించుకోవచ్చు. ఒకటి: వివిధ రచయితలు, కవులు (మారేపల్లి రామచంద్ర శాస్త్రి, కాళ్ళకూరి నారాయణరావు, కొడాలి ఆంజనేయులు, నాగభైరవ కోటేశ్వరరావు, సి. నారాయణ రెడ్డి, ఆలూరి బైరాగి, అద్దేపల్లి రామ మోహనరావు, ఎండ్లూరి సుధాకర్, కొండేపూడి నిర్మల), విమర్శకులు (కేతు విశ్వనాథ రెడ్డి, చేకూరి రామారావు), పరిశోధకులు (ఎన్. గోపి, బేతవోలు రామ బ్రహ్మం), భాషా శాస్త్రవేత్త (తూమాటి దొణప్ప)లపై రాసినవి. చేకూరి రామారావు కూడా భాషా శాస్త్రవేత్త అయినప్పటికీ ఈ సంపుటిలోని వ్యాసం ఆయన విమర్శనా పద్ధతులకు సంబంధించినది. రెండు: సమీక్షా వ్యాసాలు (కళాసాగర్ ప్రచురించిన కథల సంకలనం *కథాసాగర్* పైన, పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రచురించిన ఒక దశాబ్దపు కవితల సంకలనం *కవితా ఓ కవితా*పైన రాసిన సమీక్షలు). మూడు: సాహిత్యానికి సంబంధించిన జనరల్ వ్యాసాలు.

కవులు, విమర్శకులు, పరిశోధకుల కృషిని సంగ్రహంగా, వీలైనంత సమగ్రంగా అందించడంలో ద్వా.నా. శాస్త్రి సఫలమయ్యారు. ముఖ్యంగా తూమాటి దొణప్ప, బేతవోలు రామబ్రహ్మం, ఎన్. గోపిలపై రాసిన వ్యాసాలు వారి ప్రతిభా సామర్థ్యాలతోపాటు వ్యాస రచయిత ప్రతిభకూ అద్దంపట్టాయి. లిఖిత పత్రికల గురించి సమాచారాన్ని సేకరించడం అంత తేలిక కాదు. అటువంటిది ద్వా.నా. శాస్త్రి వాటి గురించి చాలా సమాచారాన్ని సేకరించారు. కొన్ని మంచి రచనలు వెలుగులోకి రాకుండా లిఖిత సాహిత్య పత్రికలలో ఉండిపోయాయని, వాటిని సేకరించి భద్రపరచవలసి ఉందని ఆయన లిఖిత పత్రికల గురించి రాసిన వ్యాసంలో సూచించారు. నిజాన్ని నిర్భయంగా వెల్లడించడం, తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేయగలగడం విమర్శకునికుండవలసిన లక్షణం. అది ద్వా.నాకు బాగా అబ్బిందనడానికి ఈ సంపుటిలోని *జానపద సాహిత్యం-మరో చూపు, స్త్రీలను కించపరచే అలంకారాలు, ముందు మాటల ప్రహసనం, తెలుగులో కవిత్వ పత్రికలు* అన్న వ్యాసాలు నిదర్శనం. జానపద సాహిత్యం మరీ గొప్పదని ప్రచారం చెయ్యడం సరికాదు. జానపద సాహిత్యంలోనూ ఛాందసభావాలు, మూఢ నమ్మకాలు, తిరోగమన ధోరణులున్నాయి. వాటిని పరిహరించి మిగిలిన జానపద సాహిత్యాన్ని స్వీకరించడం సముచితంగా ఉంటుందని రచయిత తన వ్యాసంలో సూచించారు. ఈ వ్యాస సంపుటిని చదివితే శాస్త్రి సాహిత్య మూల్యాంకనానికి సామాజిక శ్రేయస్సునే తూనికరాయిగా చేసుకున్నట్లు స్పష్టమవుతుంది. సాహిత్య ప్రక్రియ ఏదైనప్పటికీ అది ప్రజల పక్షపాతిగా ఉండాలన్నది ఆయన అభిప్రాయంగా తోస్తుంది. అందుకనే కాబోలు ఆయన పద్య రచనను నిరసించలేదు. అవి అభ్యుదయాన్ని కోరేవిగా ఉంటే వాటికుండే పాఠకులు వాటికుంటారని, పద్యానికి పునర్జన్మ లేదని ప్రకటించడం తొందరపాటు కాగలదని ప్రకటించారు. పద్యంపై ఇంతటి ఆశావహ దృక్పథాన్ని ప్రదర్శించిన శాస్త్రి (ప్రాచీన పద్యాలలో దళితవాద, స్త్రీవాద స్ఫురణను వివరించిన వ్యాసం కూడా ఈ సంపుటిలో ఒకటి ఉంది) హైకూ ప్రక్రియ దగ్గరకు వచ్చేసరికి ఎందుకనో పెదవి విరిచారు. పాఠకులను అయోమయంలోకి నెట్టేట్లుగా ఉన్న హైకూలనే ఆయన తన వ్యాసంలో ఉటంకించారు. నిజానికి తెలుగులో చక్కని హైకూలను అందిస్తున్న కవులు నలుగురైదుగురు లేకపోలేదు. అన్ని వచన కవితలు, మినీ కవితలు గొప్పవి కానట్లుగానే అన్ని హైకూలూ గొప్పగా ఉండకపోవచ్చు. అవి భావకవిత్వ, మర్మకవిత్వ వాసనలను వదలిపెట్టడం లేదని, సామాజిక అభ్యుదయాన్ని కోరే అవకాశం వాటిలో అంతగా ఉండడం లేదని, కనుక వాటి జోలికి వెళ్ళకపోవడం మంచిదన్నట్లుగా అభిప్రాయాన్ని వెలిబుచ్చడం సబబు కాదు. "హైకూల వ్యామోహం తెలుగు కవిత్వానికి పుష్టిని చేకూర్చలేదు" అని ప్రకటించేయడం సమర్థనీయం కాదు. బైరాగి కవితాతత్వాన్ని వివరించిన వ్యాసం బాగుంది. బైరాగి నిరాశా కవి, పలాయనవాది కాదని నిరూపించడంలో వ్యాస రచయిత బైరాగి రాసిన *నాక్కొంచెం నమ్మకమివ్వు/ కొండల్ని పిండి కొట్టేస్తాను/పరమ శివుని శూలాగ్రాన తలకిందుగ నిలబడతాను* అనే కవితను కూడా ఉపయోగించుకుని ఉంటే బాగుండేది. తెలుగులో సాహిత్య విమర్శను శాస్త్రి మూడు రకాలుగా-సాహిత్య ప్రమాణాలూ, సిద్ధాంతాలతో చేసే విమర్శ, నిబద్ధ విమర్శ, అనిబద్ధ విమర్శ లేదా అభిరుచి విమర్శ-విభజించారు. ఇందులో మూడవ కోవకు చెందిన శాస్త్రి విమర్శ రచయితలు, కవులు, పరిశోధకులకు కరదీపికగా నిలుస్తుందని ఆశిద్దాం. ■

> **ముందుమాటల్ని బాగా పరిశీలిస్తే ఎవరు ఎవర్ని ఎప్పుడు పొగిడారో, ఎప్పుడు తెగిడారో, ఎవరి అవసరాలు, అనుబంధాలు ఎటువంటివో తెలిసిపోతుంది.**